అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

లింగోజిగూడ: తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో హయత్‌నగర్ నుంచి చింతలకుంట చాకలి ఐలమ్మ విగ్రహం వరకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కీసర నర్సిరెడ్డి, నాయకులు సీహెచ్ వెంకన్న, మల్లెపాక వీరయ్య, కనకయ్య, చింతపల్లి కృష్ణయ్య, మల్లేశం, రామస్వామి, మనోహర్, శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.

న్యూనాగోల్‌లోని ఎస్‌కే డాంగే భవన్‌లో..

నాగోలు: సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ న్యూనాగోల్‌లోని ఎస్‌కే డాంగే భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధులు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.రవీంద్ర చారి మాట్లాడుతూ తెలంగాణ సాయిధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ, సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములు గౌడ్, సహాయ కార్యదర్శులు కందుల సుధాకర్, బోయపల్లి రాములు గౌడ్, ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి ఎం మద్దిలేటి, ఏఐఎస్‌ఎఫ్ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి బాతరాజు రేణుక, నాయకులు పాల్గొన్నారు.



ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బోడుప్పల్‌లో వరల్డ్ రేబిస్ డే

బోడుప్పల్: ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌నగర పాలక సంస్థ, బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఎన్‌జీఓ, కొల్లాబ్రేషన్ విత్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ మిషన్ రేబిస్ అండ్ వెటర్నరీ సర్వీసెస్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం బోడుప్పల్‌లో వరల్డ్ రేబిస్ డేను నిర్వహించారు. కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు ప్రమాదవశాత్తు కరిచిన రేబిస్ సోకకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు వివరించారు. బోడుప్పల్‌లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు కలిపి మొత్తం 325 కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్ వేశామన్నారు. బ్లూ క్లాస్ ఆఫ్ హైదరాబాద్ పీఎఫ్‌ఓ కుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి రెడీ!

దిల్‌సుఖ్‌నగర్: గణేశ్ నిమజ్జనానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. రూట్ మ్యాప్ ప్రకారం విగ్రహాలను శోభాయాత్రగా తరలించేందుకు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగా నిమజ్జనాలు పూర్తికాగా మిగితావి ఈ రోజుతో పూర్తి కానున్నవి.

ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..

నిమజ్జనానికి వచ్చే మండపాల నిర్వాహకులు, భక్తులు ప్రతిఒక్కరూ రూట్‌మ్యాప్‌ను అనుసరించి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అధికారులు కోరుతున్నారు. సరూర్‌గర్ చెరువు, వినాయకసాగర్‌కు విగ్రహాలు తరలిరానున్న నేపథ్యంలో ప్రధాన ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అలాగే అదనపు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

వన్‌ఎంట్రీ.. వన్‌ఎగ్జిట్..

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌కు తరలివచ్చే వాహనాలకు వన్‌ఎంట్రీ.. వన్‌ఎగ్జిట్ విధానాన్ని అమలు చేస్తూ ర్యూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఏసీపీలు, సీఐలు, పీఎస్‌ల పరిధిలోని సిబ్బందితో పాటు అదనంగా సిబ్బంది పాల్గొంటారు. ఊరేగింపులో డీజేలకు, కట్టపై తినుబండారాలు, బొమ్మలు విక్రయించే హాకర్లకు, ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

నిమజ్జన రూట్ మ్యాప్..

- మలక్‌పేట, అంబర్‌పేట వైపు నుంచి నిమజ్జనానికి తరలివచ్చే వారు గడ్డిఅన్నారం చౌరస్తామీదుగా శంకేశ్వరబజార్ నుంచి కట్టపైకి రావాలి.
- బీఎన్‌రెడ్డి, హస్తినాపురం, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు రాజీవ్‌చౌక్ మీదుగా గడ్డిఅన్నారం చౌరస్తా మీదుగా కట్టపైకి చేరుకోవాలి.



- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వన్ ఎంట్రీ...వన్ ఎగ్జిట్ అమలు
- అడుగడుగునా పటిష్ట బందోబస్తు
- సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా
- రూట్‌మ్యాప్ ప్రకారం
- శోభాయాత్రగా విగ్రహాల తరలింపు

- చంపాపేట, సైదాబాద్, సంతోష్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు శంకేశ్వరబజార్ మీదుగా రావాలని సూచించారు.

నిమజ్జనానికి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలు..

- పీఎంహోం, జ్యోతిక్లబ్, సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, సరూర్‌నగర్ జూనియర్ కళాశాల, సరూర్‌నగర్ కట్ట కిందది భాగంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.
- ఎలక్ట్రానిక్ మీడియా ఓబీ వ్యాన్‌లు ఇందిరా ప్రియదర్శిని పార్కు ఎదుట నిలపాలి.

పటిష్ట బందోబస్తు..

రాచకొండ జాయింట్ కమిషనర్ పర్యవేక్షణ, డీసీపీ ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీతో పాటు ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, బీఎస్‌ఎఫ్, కమ్యూనికేషన్, ఏఆర్, ట్రాఫిక్ తదితర విభాగాల సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. కంట్రోల్ రూమ్‌ద్వారా సూచనలిస్తూ నిమజ్జనం సాఫీగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. లక్షలాది మంది భక్తులు శోభాయాత్ర, నిమజ్జనానికి తరలి రానుండడంతో సీసీ కెమెరాలతో నిఘా పెట్టామని ఎల్‌బీనగర్ డీసీపీ తెలిపారు. అలాగే విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మొత్తం ప్లాట్‌ఫాంల వద్ద ఏడు క్రేన్లు, రెండు మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రైతు బజారుల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు. (కిలో... రూపాయల్లో) టమాట రూ. 31, వంకాయ రూ. 35, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 18–28, కాకర రూ. 52, బీర రూ. 50, క్యాబేజీ రూ. 17, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 50, దొండ రూ. 35–45, చిక్కుడు రూ. 80, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 18, సొర రూ. 19, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 35, చామగడ్డ రూ. 37. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

చలో పరేడ్ గ్రౌండ్స్ విజయవంతం చేయండి

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సైదాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం రజాకార్ల రాక్షస పాలన నుంచి తెలంగాణ విమోచన కోసం త్యాగం చేసిన తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలన్నారు. పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. భాగ్యనగర్ జిల్లా పరిధిలోని అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ప్రధాన చౌరస్తాల్లో భక్తులకు తాగునీరు



ఎల్‌బీనగర్ జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి

ఎల్‌బీనగర్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఎల్‌బీనగర్ ప్రధాన చౌరస్తాల్లో జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పిస్తున్నామని ఎల్‌బీనగర్ జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ మొత్తం 9 ప్రాంతాల్లో 60 వేల వాటర్ ప్యాకట్లతో వాటర్ క్యాన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ చౌరస్తా, మన్సూరాబాద్, నాగోలు చెరువులు, సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్, కర్మన్‌ఘాట్ చౌరస్తా, బైరామల్‌గూడ చౌరస్తా, గణేశ్ ఆలయం, హయత్‌నగర్ ఎంఆర్‌ఓ కార్యాలయం, తొర్రూర్ ఎక్స్ రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద తాగునీరు అందించేందుకు జలమండలి సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి



హస్తినాపురంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. వేంకటేశ్వరకాలనీలో కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు డ్రైనేజీ సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నారని శాశ్వతపరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు దుర్గయ్యగౌడ్, గోదల రఘుమారెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు చైర్మన్‌గా ఎస్. వెంకటస్వామి, వైస్ చైర్మన్‌గా బీ బాపిరాజు, కార్యదర్శిగా కే.ఎస్.ఎస్ ప్రసన్నకృష్ణ, అదనపు కార్యదర్శిగా జీ కృష్ణరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్. శ్రీనివాస్, కోశాధికారిగా నందికొండ లోహిత్ రెడ్డి, ధర్మకర్తలుగా ఎస్. తిరుమలరావు, ఐ. హేమసుందర్ రావు, టీఏపీబీ. బాలజీ, వీ శంకర్, ఎస్. సాయిరాం, కో ఆప్టెడ్ ట్రస్టీగా అనంతుల సురేందర్‌రెడ్డి, సలహాదారులుగా అనంతుల యాదగిరిరెడ్డి, వారణాసి వంశీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

గురుకుల అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: అంకుసాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇబ్రహీం మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్–1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–1, జాగ్రఫీ–1 అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం గల మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అదనపు సమాచారం కోసం ఫోన్: 99484 86101లో సంప్రదించాలన్నారు.

యువకుల దాడిలో ముగ్గురికి గాయాలు

మలక్‌పేట: యువకుల దాడిలో ముగ్గురు గాయపడ్డారు. మలక్‌పేట ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్‌కు చెందిన కాటపల్లి విజయేందర్ రెడ్డి, భార్య, కూతురు, అల్లుడితో కలిసి ఆదివారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి సమీపంలో వారి కారును వెనుక నుంచి యువకులు కారుతో ఢీకొట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. వారించబోయిన విజయేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై వారు దాడి చేయగా విజయేందర్‌రెడ్డి, భార్య నిర్మల, అల్లుడు సాయిపవన్‌రెడ్డికి గాయపడగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటనపై నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ ఫుటేజ్ పరిశీలించి, న్యాయ సలహా తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో అఖిల్ అనే యువకుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్లు తేలింది. అఖిల్‌తో పాటు 20 మంది యువకులు ఉన్నట్లు బాధితులు పేర్కొన్నారు.

పూజలు..అన్నదానాలు..



ఎల్బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గాలవ్యాప్తంగా గణేశ్ నవరాత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరిరోజు నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మండపాలను సందర్శించి లంబోధరుడికి పూజలు చేశారు. పలుచోట్ల లడ్డూలను వేలం వేయగా పోటీ పడి దక్కించుకున్నారు. అలాగే అన్నదానాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు నిమజ్జనాల సందడి నెలకొన్నది.

–ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ల బృందం



వాసవీకాలనీ పూజల్లో కాలనీవాసులు..



లడ్డూ సొంతం చేసుకున్న ప్రసన్న సతీశ్ దంపతులు



శంకేశ్వరబజార్‌లో మధుసూధన్‌గౌడ్.



గడ్డిఅన్నారం గౌడబస్తీలో కార్పొరేటర్, సభ్యులు



జ్ఞానదీప్ టవర్స్‌లో విజయసింహారెడ్డి, సభ్యులు



మిద్దెలకు లడ్డూను అందజేస్తున్న సభ్యులు



శాతవాహననగర్ పూజల్లో ఎమ్మెల్సీ బల్మూరీ



రాక్‌టౌన్‌కాలనీలో ప్రసన్న మహిపాల్‌రెడ్డి



ప్రెస్‌కాలనీ పూజల్లో భక్తులు



టీఎన్‌ఆర్ సులక్షణ అపార్ట్‌మెంట్‌లో ..



హౌసింగ్ కాంప్లెక్స్‌లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి



తుర్కయంజల్ మున్సిపాలిటీ మునగనూరు టెలిఫోన్ కాలనీలో..



సైదాబాద్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద సందడి



ఎల్‌బీనగర్‌లో పూజల్లో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



కొత్తపేటలో కార్పొరేటర్ పవన్‌కుమార్



సరూర్‌నగర్ వేంకటేశ్వరకాలనీ రోడ్డు నంబర్ -2లో పూజల్లో భక్తులు

నిమజ్జన కొలనులో వ్యర్థాల తొలగింపు



క్రేన్ సహాయంతో విగ్రహాలను బయటకు తీస్తున్న సిబ్బంది

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని కొలనులో నిమజ్జనం చేసిన విగ్రహాలను క్రేన్ సహాయంతో ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్‌యార్డ్‌ను తరలిస్తున్నారు. సోమవారం వరకు సుమారు 600 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.

తరచూ క్రేన్ మొరాయింపు

నిమజ్జన కొలను వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ తరచూ మొరాయిస్తుండడంతో భక్తులు ఇబ్బందులు తప్పడం లేదు. విగ్రహాలను తీసుకువచ్చిన నిర్వాహకులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శని, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో విగ్రహాలు రావడం, క్రేన్ మొరాయించింది. చివరిరోజు ప్రత్యామ్నాయంగా మరో క్రేన్‌ను అందుబాటులో ఉంచాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

నేడు కొలను వద్ద అన్నప్రసాదం వితరణ

వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు పెద్దచెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలను ప్రాంగణం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టన్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మ.12 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నప్రసాదం అందజేస్తామని పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

చైతన్యపురి: గణేశ్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌ను సందర్శించారు. చెరువు కట్ట వద్ద ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక్

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కేఎల్‌ఆర్

పహాడీషరీఫ్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని జల్‌పల్లి మున్సిపాలిటీలో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక వంటకాలు చేసుకొని బంధుమిత్రులకు తినిపించుకొని అల్లాహ్ స్మరణలో గడిపారు. వినాయక నిమజ్జనం నేపథ్యంలో 19వ తేదీన ర్యాలీలు తీయాలని మతపెద్దల సూచనలతో ఇంటి పట్టునే పండగను జరుపుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ముస్లింలతో కలిసి పండగ జరుపుకున్నారు. పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ చైర్మన్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో ముస్లింలందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడదీస్తోందన్నారు. వారంరోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు, పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు పంచి ముస్లింలు మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. ఒకరి పండగల్లో మరొకరు పాల్గొని మతసామరస్యాన్ని చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.